సాక్షి ప్రకాశం

శుక్రవారం | 20 | అక్టోబర్ | 2023



నూతన పంటలతో లాభాలు

నూతన పంటల సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతు విజ్ఞాన యాత్రను ఆయన ప్రారంభించారు. - IIలో..



బాలినేని పేదల మనిషి

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేదల మనిషి అని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి కొనియాడారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
36/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జీజీహెచ్ ఇన్‌చార్జ్ ఆర్‌ఎంఓగా డాక్టర్ తిరుమలరావు

ఒంగోలు టౌన్: స్థానిక జీజీహెచ్ ఇన్‌చార్జ్ ఆర్‌ఎంఓగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ తిరుమలరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్‌ఎంఓగా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ చైతన్యవర్మ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. ఆయన స్థానంలో తిరుమలరావును నియమించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై డివిజన్ స్థాయి కమిటీలు

ఒంగోలు అర్బన్: జిల్లాలో అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఇప్పటికే జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. తాజాగా డివిజన్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో కనిగిరి ఆర్డీఓ చైర్మన్‌గా, సబ్ రిజిస్ట్రార్, కనిగిరి సీఐ, పామూరు ఎస్సై, పీసీ పల్లి ఎస్సైలతో కమిటీ ఏర్పాటు చేశారు. అదేవిధంగా మార్కాపురం డివిజన్ పరిధిలో సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్లు, మార్కాపురం సీఐ, ఎస్సైలతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు.

నేడు కలెక్టరేట్లో ఎంప్లాయీస్ గ్రీవెన్స్

ఒంగోలు టౌన్: స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు స్పందన సూపరింటెండెంట్ నాగజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కనిగిరి ఆర్డీఓ బదిలీ

ఒంగోలు అర్బన్: కనిగిరి ఆర్డీఓ టి.అజయ్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయన స్థానంలో జాన్‌ఇర్విన్‌ను నియమించింది.

స్వయం ప్రకాశం

టీడీపీ హయాంలో కుదేలైన స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఊపిరిపోసింది. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకున్న సంఘాల సభ్యులు ఆర్థికంగా బలపడుతున్నారు. అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని వ్యాపారాల్లో రాణిస్తూ విజయపథంవైపు దూసుకుపోతున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వచ్చిన రుణాలతో పాటు పీఎంఎఫ్‌ఎంఈ రుణాలు కూడా ఇప్పించి మహిళలు వ్యాపారంలో ఎదుగుదలకు తోడ్పడుతున్నారు డీఆర్‌డీఏ అధికారులు.

- ఆర్థిక పురోగతిలో స్వయం సహాయక సంఘాలు
- వ్యాపారాల్లో దూసుకుపోతున్న మహిళలు
- స్థిరమైన ఆదాయంతో ముందుకు
- మెప్మా, డీఆర్‌డీఏ పరిధిలో 41,361 గ్రూపుల్లో 4.14 లక్షల మంది సభ్యులు
- లక్షల కుటుంబాల్లో జగనన్న సంక్షేమ వెలుగులు



జగనన్న మార్ట్‌లో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు

చీమకుర్తి: మెప్మా, డీఆర్‌డీఏ పరిధిలో కలిపి జిల్లాలో మొత్తం 41,361 స్వయం సహాయక గ్రూపులు ఉన్నాయి. వాటిలో 4.14 లక్షల మంది సభ్యులున్నారు. వారిలో దాదాపు 1.45 లక్షల మంది సభ్యులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల నిధులు, బ్యాంక్ లింకేజీ రుణాలతో పలు రకాల వ్యాపారాలు చేస్తున్నారు. వారు చేసే వ్యాపారాలకు పెద్ద మొత్తంలో రుణాలు కావాల్సి వస్తే మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు బ్యాంక్‌లతో టైఅప్ అయి పీఎంఈజీ వంటి పథకాల ద్వారా రుణాలిప్పించి మహిళలు చేసే వ్యాపారాలకు ప్రభుత్వపరంగా అండగా నిలుస్తున్నారు.

ఏడాదికి రూ.3 వేల కోట్ల రుణాలు...

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక గ్రూపుల సభ్యులకు ప్రభుత్వం ఏడాదికి రూ.3 వేల కోట్లకుపైనే బ్యాంక్ లింకేజీ రుణాలు, పీఎంఈజీపీ రుణాలు, సంక్షేమ పథకాలైన వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, జగనన్న తోడు వంటి పథకాల ద్వారా అందిస్తోంది. జిల్లాలోని 41,361 గ్రూపుల్లోని 4.14 లక్షల మంది సభ్యులు ప్రయోజనం పొందుతున్నారు. వారిలో వ్యాపారాల ద్వారా స్థిరమైన జీవనోపాధి పొందుతున్న వారు దాదాపు 1.45 లక్షల మంది ఉన్నట్లు సంబంధిత అధికారుల వద్ద ఉన్న గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. చంద్రబాబు హయాంలో డ్వాక్రా మహిళలు మీటింగ్‌లకు వచ్చి పోయేవారు తప్ప వారి జీవితాల్లో ఆర్థిక భరోసా కనిపించేది కాదని ప్రస్తుతం వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళలే స్వయంగా వెల్లడిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సొమ్ముకు ఊరికే బటన్ నొక్కుతున్నారనే విమర్శలు చేసే వారికి లక్షల మంది మహిళలు వ్యాపార రంగంలో రాణిస్తూ వారి జీవితాల్లో కనిపిస్తున్న వెలుగులు చెంప చెళ్లుమనిపించేలా ఉంటాయని చెబుతున్నారు. వ్యాపారాల్లో మగవారికి తీసిపోకుండా తామంటే ఏమిటో గత నాలుగేళ్ల నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో నిరూపిస్తున్నామంటున్నారు. వ్యాపారంలో అడుగులు ఎలా ముందుకు వేయాలో స్వయంగా చేసి చూపిస్తున్నామని మహిళలు ధీమా వ్యక్తం చేస్తున్నారు

మెప్మా పరిధిలో...

మెప్మా పరిధిలోని స్వయం సహాయక గ్రూపు సభ్యులు వారు తయారు చేసిన ఉత్పత్తుల ద్వారా 4 విభాగాల్లో వ్యాపారాలు చేస్తూ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. వస్త్ర, ఆభరణ్, ఆహా, ఖటా పేరుతో మెప్మా ఆఫీస్ ప్రాంగణంలో జగనన్న మహిళా మార్ట్‌లో వారు తయారు చేసిన ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. అలాగే వస్త్ర విభాగంలో సభ్యులు తయారు చేసిన నైటీలు, బ్లౌజ్‌లు, ఎంబ్రాయిడరీ దుస్తులు, మగ్గం వర్క్ చేసిన దుస్తులు, డ్రస్ మెటీరియల్స్, జూట్‌బ్యాగ్‌లు, పేపర్‌ప్లేట్లను విక్రయిస్తుంటారు. ఆహా విభాగంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో టిఫిన్, స్నాక్స్, కారంపొడి, జొన్నలు, రాగులు, రొట్టెలు, అరిసెలు, సున్ని ఉండలు, నూడిల్స్, బజ్జీల విక్రయాలతో పాటు ఫంక్షన్స్‌కు క్యాటరింగ్ కూడా చేస్తుంటారు. ఆభరణ్ విభాగంలో పాలిష్ మెటీరియల్స్, వెండి వస్తువులు, బంగారం షాపుల్లో పాలిషింగ్, వన్ గ్రాం గోల్డ్ వంటి వాటిని విక్రయించడం, సేవలందించడం జరుగుతోంది. ఖటా విభాగంలో అల్లికలు, వైర్‌బుట్టలు, వెదురు బద్దల అలంకరణలు, డోర్ కర్టన్స్, సాఫ్ట్‌టాయ్స్, తోలు వస్తువులు విక్రయిస్తూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు.

మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు గ్రామానికి చెందిన కరవది జయలక్ష్మి రూ.10 లక్షలతో పొలాల్లో తేనెపట్టు తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టు ద్వారా తీసిన తేనెను బాటిల్స్‌లో నిల్వ చేసి విజయవంతంగా మార్కెటింగ్ చేస్తూ స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.



స్వయం సహాయక సభ్యురాలు పెట్టిన తేనె కేంద్రంలో అధికారులు

సింగరాయకొండకు చెందిన సమీర స్వయం సహాయక గ్రూపు సభ్యురాలు రవిపద్మ రూ.3 లక్షల రుణం తీసుకున్నారు. మరో రూ.5 లక్షలు వర్కింగ్ క్యాపిటల్‌తో బిస్కట్ల తయారీ కంపెనీ ప్రారంభించారు. ఏడాదికి రూ.50 లక్షల టర్నోవర్‌తో వ్యాపారాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

దొడ్డవరప్పాడుకు చెందిన గద్దల కవిత మద్దిపాడులో ఎంబ్రాయిడరీ మిషన్ పెట్టుకుని రోజువారీ ఆదాయంతో జీవనోపాధి పొందుతున్నారు. అలాగే దొనకొండలో ధనలక్ష్మి సెంట్రింగ్ చెక్క వ్యాపారంతో ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇలా చాలా మంది మహిళలు పేపర్ ప్లేట్లు, జూట్‌బ్యాగ్‌ల తయారీ, కారం, పిండి మిల్లుల వ్యాపారం, ఫుడ్‌ప్రాసెసింగ్ వ్యాపారాలు చేస్తూ విజయవంతంగా దూసుకుపోతున్నారు.



సెంట్రింగ్ చెక్క వ్యాపారం చేస్తున్న ధనలక్ష్మి

వ్యాపారాల్లో మహిళలు రాణిస్తున్నారు



ప్రభుత్వం అందించే రుణాలతో పాటు బ్యాంక్ లింకేజీ రుణాల ద్వారా స్వయం సహాయక గ్రూపుల మహిళలు వ్యాపారాల్లో రాణిస్తున్నారు. జిల్లాలోని మెప్మా, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో 41 వేల స్వయం సహాయక గ్రూపులున్నాయి. వాటి పరిధిలో 4 లక్షలకుపైగా సభ్యులున్నారు. వారిలో ఎక్కువ మంది మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మెప్మా కార్యాలయ ప్రాంగణంలోనే జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటు చేశాం. ప్రతి వారు ప్రతి నెలా స్థిరమైన ఆదాయం సంపాదిస్తూ వారి కాళ్లమీద వారు జీవించడమే కాకుండా మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నారు.

– తేళ్ల రవికుమార్, మెప్మా, డీఆర్‌డీఏ పీడీ, ఒంగోలు

బాలినేనిపై ఆరోపణలు చేస్తే సహించం

- అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- నకిలీ స్టాంపులు, డాక్యుమెంట్ల కేసును తప్పుదారి పట్టించేందుకే అవాస్తవాలు
- టీడీపీ నాయకులు రాజకీయ పబ్బం కోసమే కుయుక్తులు
- నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు బాలినేని
- ఆయనకు తిరిగి సెక్యూరిటీ ఇచ్చి రక్షణ కల్పించాలి
- జిల్లా ఏఎస్పీ (క్రైమ్స్) శ్రీధర్‌రావుకు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఏఎస్పీ (క్రైమ్స్) శ్రీధర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు చేసిన టీడీపీ, జనసేన నాయకులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం జిల్లా ఏఎస్పీ (క్రైమ్స్) ఎస్‌వీ శ్రీధర్‌రావుకు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఏఎస్పీ చాంబర్‌లో ఏఎస్పీని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు.. గత ఇరవై రోజులుగా ఒంగోలులో బాలినేనిపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారన్న విషయాలతో కూడిన ఫిర్యాదు అందజేశారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన అనుచరులతో బాలినేనిపై లేనిపోని ఆరోపణలు చేయిస్తున్నాడని వివరించారు. బాలినేనితో పాటు ఆయన తనయుడు, యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డిపై కూడా లేనిపోని విమర్శలు చేస్తున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థాయిని మరిచి మరీ బాలినేని శ్రీనివాసరెడ్డిపై అసత్య ఆరోపణలు చేసి శునకానందం పొందుతున్న దామచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా టీడీపీకి చెందిన ఎద్దు శశికాంత్ భూషణ్, కామేపల్లి శ్రీనివాసరావు, ముత్తన శ్రీనివాసరావు లాంటి వారిని ఉసిగొల్పి బాలినేనితో పాటు అతని వెంట ఉంటున్న తమలాంటి నాయకులపై కూడా భూకబ్జాలు లాంటి అసత్య ఆరోపణలు దామచర్ల చేయిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ కూడా బాలినేనిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వివరించారు. అందరూ కలిసి మూకుమ్మడిగా మాటలతో దాడులు చేసి మానసికంగా వేధిస్తే బాలినేని పక్కన ఏ ఒక్క నాయకుడు లేకుండా పోతారన్నది టీడీపీ నాయకుల ఆలోచన అని అన్నారు. బాలినేని ప్రజా నాయకుడని, ఇటువంటి ఉడత ఊపులకు బెదిరే నాయకుడు కాదని స్పష్టం చేశారు.

అనంతరం ఎస్పీ కార్యాలయం బయట మీడియాతో వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీకి, బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి టీడీపీ నాయకులు ఓర్వలేక లేనిపోని చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నకిలీ స్టాంపులు, డాక్యుమెంట్ల కేసులో టీడీపీ నాయకులు ఉన్నారని, అందువలన పోలీసుల దర్యాప్తును తప్పుదారి పట్టించడానికి నేలబారు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. రోజురోజుకు క్షీణించిపోతున్న టీడీపీని ఎలాగైనా కాపాడుకోవాలన్న తాపత్రయంతో బాలినేనిపై అవాకులు, చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. బాలినేని శ్రీనివాసరెడ్డికి పోలీసులు రక్షణ కల్పించాలన్నారు. గన్‌మెన్లను వాసన్న వెనక్కి పంపారని, టీడీపీ, జనసేన నాయకుల చౌకబారు మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని కూడా ఆయనకు విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నేత బాలినేని అని, ఆయనకి గన్‌మెన్లను తిరిగి ఇచ్చి రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాదు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, పురిణి ప్రభావతి, కార్పొరేటర్లు ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

చేదోడును సద్వినియోగం చేసుకోండి

- చెక్కులు పంపిణీ చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్



జగనన్న చేదోడు లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మేయర్ గంగాడ సుజాత, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు

ఒంగోలు సిటీ: చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బీసీ కులస్తులకు జగనన్న చేదోడు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. జగనన్న చేదోడు పథకం ద్వారా వరుసగా నాలుగో ఏడాది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేసే రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించారు. దానికి అనుబంధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. షాపులున్న రజక, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు ఏటా రూ.10 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 2,643 మంది రజకులు, 1,608 మంది నాయీ బ్రాహ్మణులు, 10,284 మంది టైలర్లకు ఈ ఏడాది రూ.14.53 కోట్ల మేర లబ్ధి చేకూరుతున్నట్లు వివరించారు. షాపుల నిర్వహణకు ఈ నిధులను వినియోగించుకుని మరింత మెరుగైన జీవనోపాధి పొందాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులందరికీ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, మేయర్ గంగాడ సుజాత, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి (బన్నీ), మేదర కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.లలితా నాంచారమ్మ, వైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, రజక కార్పొరేషన్ డైరెక్టరు ఎం.శ్రీదేవి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టరు బి.లక్ష్మీనారాయణ, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టరు బి.కరుణాకర్, నూరుబాషా/దూదేకుల కార్పొరేషన్ డైరెక్టరు షేక్ సోఫియా, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టరు పి.చెన్నకేశవరావు, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జె.ఏడుకొండలు, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఎం.వెంకటేశ్వరరావు, వివిధ బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు, గ్రామ–వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలిచారు...

నాపేరు షెహన్‌షా, నేను ఒంగోలులోని 42వ సచివాలయం పరిధిలో నివసిస్తున్నాను. నేను టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. జగనన్న చేదోడు పథకం ద్వారా మూడేళ్లుగా లబ్ధిపొందుతున్నాను. నా పిల్లలకు విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో ప్రయోజనం చేకూరుతోంది. నా చెల్లికి వికలాంగ పెన్షన్ అందుతోంది. మా కుటుంబానికి దాదాపుగా రూ.2.50 లక్షల వరకు ఆర్థిక సాయం లభించింది. అన్ని విధాలుగా అండగా ఉంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా హృదయ పూర్వక కృతజ్ఞతలు

నకిలీ డాక్యుమెంట్ల కేసులో మరో ఐదుగురు అరెస్ట్


- ఇప్పటికే ఏడుగురిని అరెస్ట్ చేసిన సిట్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మలికాగర్గ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో సంచలనం సృష్టించిన నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ రబ్బరు స్టాంపుల కేసులో మరో ఐదుగురిని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) పోలీస్ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. ఆ వివరాలను జిల్లా ఎస్పీ మలికాగర్గ్ మీడియాకు వెల్లడించారు. సిట్ దర్యాప్తులో భాగంగా ఇప్పటి వరకు వీరితో కలిపి మొత్తం 12 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 26న ఒంగోలులో స్వాధీనం చేసుకున్న నకిలీ రబ్బరు స్టాంపులు, ఫోర్జరీ డాక్యుమెంట్లకు సంబంధించి ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. క్రైం నంబర్ 307/2023కు సంబంధించి 420, 467, 471, 506 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్పీ మలికాగర్గ్ పర్యవేక్షణలో జిల్లాలోని పోలీస్ అధికారులతో సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. దర్యాప్తు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో తాజాగా మరో ఐదుగురిని సిట్ బృందం అరెస్ట్ చేసింది. వారి నుంచి కొన్ని పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్న పోలీసులు.. నిందితులను రిమాండ్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం కొరిశపాడు మండలం రాచపూడి గ్రామానికి చెందిన రావి శ్రీనివాసరావు ఒకడు. ఇతను గతంలో హైదరాబాద్‌లో ఆంధ్రజ్యోతి, ఈనాడు, వార్త పత్రికల్లో పనిచేశాడు. ఆ తర్వాత ఒంగోలులోని ఆంధ్రప్రభ, సూర్య దినపత్రికల్లో జిల్లా రిపోర్టర్‌గా కూడా పనిచేశాడు. ప్రస్తుతం ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రెండో నిందితుడు వేములపాటి శ్రీనివాసరావు అలియాస్ స్పీడు ఒంగోలు నగరంలోని జక్రయ్య వైద్యశాల సమీపంలో నివాసం ఉంటూ ఒంగోలు నగరపాలక సంస్థలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. మూడో నిందితుడు బూచి వనమాలి నగరంలోని కొణిజేడు బస్టాండ్ సెంటర్‌లోని రాజా పానగల్ రోడ్డులో ఇస్త్రాకులు, వాటర్ ప్లంబింగ్ పనులు చేసుకుంటూ ఉంటాడు. నాలుగో నిందితుడు మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు గ్రామానికి చెందిన కంది సుధాకర్‌రెడ్డి కోల్డ్ స్టోరేజ్ నిర్వహిస్తూ ఉంటాడు. అదేవిధంగా ఒంగోలు నగరానికి చెందిన న్యాయవాది ఐనాబత్తిన సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నంబర్–706/2023 నమోదు చేశారు. ఈ కేసును కూడా 420, 467, 471, 506 రెడ్ విత్ 34 ఐపీసీ కింద నమోదు చేశారు. ఈ కేసులో ఇంట్లో అద్దెకు చేరి ఒంగోలు తహసీల్దార్ ఇచ్చినట్లుగా నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లు, నకిలీ అగ్రిమెంట్లు తయారు చేసుకుని ఇళ్ల తన తండ్రి ద్వారా సంక్రమించిందంటూ నకిలీ వ్యవహారం నడిపిన రెడీమేడ్ డ్రెస్ స్టిచ్చింగ్ షాపు నిర్వహించే పమిశెట్టి జయరాజును కూడా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంతో పాటు జిల్లా ప్రజలకు ఎస్పీ ప్రత్యేకంగా పలు సలహాలు, సూచనలు చేశారు. నకిలీ రబ్బరు స్టాంపులు, డాక్యుమెంట్ల కేసుల్లో ప్రధానంగా తొలుత పూర్ణచంద్రరావు, యానాదిరావు, గొర్రెపాటి రవీంద్రబాబు, విష్ణువర్ధన్‌ను ఇప్పటికే అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం వారు జైలులో ఉన్నారని, అయితే నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న జిల్లా రిజిస్ట్రార్, ఒంగోలు పేరుతో రౌండ్ రబ్బరు స్టాంపు సీళ్లు వివిధ తేదీల్లో ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అయితే, ఆయా తేదీల్లో ఏమైనా డాక్యుమెంట్లు ఉంటే అలాంటి వారు ఒంగోలు తాలూకా సీఐ పి.భక్తవత్సలరెడ్డినిగానీ, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డినిగానీ సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

వైభవం.. నవరాత్రి మహోత్సవం



దసరా సందర్భంగా దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం లలితాత్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఒంగోలులోని లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో రాజరాజేశ్వరీదేవిని గాజులతో లలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

కల్తీ పాల గుట్టు రట్టు

- దర్శి కేంద్రంగా పెద్ద ఎత్తున కల్తీ పాల వ్యాపారం
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు
- 120 లీటర్ల కల్తీ పాలు, సామగ్రి స్వాధీనం
- కేసు నమోదు, నిందితుల అరెస్టు



పాలకేంద్రం నిర్వాహకుడు, సిబ్బందిని అదుపులోకి తీసుకున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ

దర్శి: కల్తీ పాల వ్యాపారం గుట్టురట్టయింది. దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డులో గల గాంధీనగర్‌లో కల్తీ పాల వ్యాపారం జరుగుతోందన్న సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బి.శ్రీభవానిహర్ష ఆధ్వర్యంలో గురువారం దాడి చేయగా విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. దర్శి పట్టణానికి చెందిన యేరువ పుల్లారెడ్డి సర్వే నంబర్ 896–1లో పాలకేంద్రం పేరుతో పెద్ద ఎత్తున కల్తీ పాల వ్యాపారం చేస్తున్నాడు. అక్కడ కల్తీ పాలు తయారు చేస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కల్తీ పాలకు ఉపయోగించే నూనె ప్యాకెట్లు, కెమికల్స్, రెండు మిక్సీలు, 120 లీటర్ల కల్తీ పాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు యేరువ పుల్లారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అక్రమంగా డబ్బు సంపాదనే లక్ష్యంగా ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగించే పనులు చేపట్టడంపై పలు సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. గ్రామాల నుంచి కొన్ని పాలు సేకరించి పాల కేంద్రం ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా కల్తీ చేసి విక్రయిస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు ఏఎస్పీ శ్రీభవానిహర్ష తెలిపారు. ఇలాంటి కల్తీ పాలతో పసిపిల్లల ప్రాణాలకే ముప్పు తలెత్తే ప్రమాదముందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజ్ చేసిన పాలను ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. పుల్లారెడ్డితో పాటు అతనికి సహకరిస్తున్న సిబ్బందిపై కూడా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. లాభాపేక్షతో ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా కల్తీ పాల వ్యాపారం జరుగుందని తెలిస్తే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే కల్తీని పూర్తిగా రూపుమాపవచ్చని అన్నారు. జిల్లా ఆహార భద్రత అధికారుల సహకారంతో కల్తీని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో సీఐ రాఘవరావు, ఎస్సై నాగేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నరసింహుడు, వీఆర్వో గాలిరెడ్డి పాల్గొన్నారు.

శభాష్ నిఖిల్..!

- ఇన్‌స్పైర్ పోటీలో సత్తా చాటిన నిఖిల్‌కు కలెక్టర్ అభినందనలు


నిఖిల్‌ను అభినందిస్తున్న కలెక్టర్

ఒంగోలు టౌన్: ఇన్‌స్పైర్ మనక్ జాతీయ పోటీల్లో జిల్లాలోని మారుమూల ప్రాంతానికి చెందిన పుల్లచెరువు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి మల్లెల నిఖిల్ చంద్ టాప్ 60కి ఎంపికయ్యాడు. నిఖిల్ ప్రదర్శించిన స్ప్రాకేషన్ ఆఫ్ ఫోర్ వేయక్సా మిషన్ అనే ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఎంపికైంది. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున అతడు పాల్గొన్నాడు. మొత్తం 35 మంది విద్యార్థులు పాల్గొనగా నిఖిల్ ఎంపికవడం విశేషం. గురువారం నిఖిల్‌ను, అతడికి గైడ్ చేసిన ఉపాధ్యాయుడు షేక్ మస్తాన్ వలిని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అభినందించారు. ముమ్ముందు కూడా నిఖిల్ ఇలాగే ప్రతిభ చాటాలని, జిల్లాకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. రూ.10 వేల ప్రోత్సాహకాన్ని కలెక్టర్ చేతుల మీదుగా డీఈఓ వీఎస్ సుబ్బారావు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, జానీబాష, నాగేశ్వరరావు, రాము పాల్గొన్నారు..

వన్‌టౌన్ సీఐగా లక్ష్మణ్

ఒంగోలు సబర్బన్: ఒంగోలు వన్‌టౌన్ సీఐగా లక్ష్మణ్‌ను నియమించారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. లక్ష్మణ్ ఇప్పటి వరకు గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్నారు. ఇప్పటి వరకు ఒంగోలు వన్‌టౌన్ సీఐగా పనిచేసిన వెంకటేశ్వరరావును వీఆర్‌కు పంపడంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది.

పాహిమాం జగన్మాతా..!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


ప్రత్యేక అలంకరణలో ఒంగోలు కేశవస్వామిపేట కనకదుర్గాదేవి


బేస్తవారిపేటలో గజలక్ష్మీదేవిగా వాసవీమాత


కనిగిరిలో మహాచండీ దేవి అలంకరణలో..


దొనకొండలో శాకాంబరీ పార్వతీదేవిగా ..


మార్కాపురంలో మహాలక్ష్మిగా వాసవీ అమ్మవారు


పెద్దదోర్నాలలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు


వల్లూరులో మహాచండీదేవిగా వల్లూరమ్మ


త్రిపురాంతకం స్కంధమాతగా మయూరవాహన సేవ


పెదకొత్తపల్లిలో సంతాన లక్ష్మి అలంకరణలో..


ఒంగోలు సంతానలక్ష్మీదేవిగా రాజ్యలక్ష్మీదేవి

నూతన పంటల సాగుతో లాభాలు

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్
- రైతుల విజ్ఞాన యాత్రను జెండా ఊపి ప్రారంభం


రైతుల విజ్ఞానయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సెంట్రల్: రైతులు సంప్రదాయ పంటలకు భిన్నంగా నూతన పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సుగంధ ద్రవ్యాల పంటల సాగును ప్రోత్సహించే నిమిత్తం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రైతుల విజ్ఞాన యాత్రను కలెక్టరేట్ వద్ద కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 300 ఎకరాల్లో ఆరోమా పంటలు (సుగంధ ద్రవ్యాల) సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. పంట మార్పిడిలో భాగంగా ఆరోమా పంటలైన వట్టివేరు, లెమన్ గ్రాస్, పామ్ రోజా వంటి పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు. నూతన పంటల సాగుతో రైతులు ఆర్థికంగా మరింత స్థిరపడతారని తెలిపారు. ఉద్యానవన శాఖాధికారి గోపిచంద్ మాట్లాడుతూ జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు, బేస్తవారిపేట, కంభం ప్రాంతాల్లో రైతులు లెమన్‌గ్రాస్, పామ్‌రోజా పంటలు సాగు చేస్తున్నారని చెప్పారు. ఆ ప్రాంత రైతుల సాగు పద్ధతులను అవగాహన కల్పించటానికి ఈ ప్రాంత రైతులకు విజ్ఞానయాత్రకు తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సుగంధ ద్రవ్యాల పంటలకు మంచి డిమాండ్ ఉందని చెప్పారు. ఉద్యానవన శాఖ అమలు చేస్తున్న అనేక పథకాలు పశ్చిమ ప్రకాశంలో ఎక్కువగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు విజ్ఞానాన్ని పంచుకుని ఈ ప్రాంతంలో కూడా మంచిగా సాగు చేయాలని ఆకాంక్షించారు.


అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం

- బాలినేని మంచితనాన్ని చేతగానితనం అనుకుంటున్నారా
- టీడీపీ, జనసేన నాయకులు ప్రతి విషయాన్ని బాలినేనికి అంటగడుతున్నారు
- ఇది మంచి పద్ధతి కాదని మేయర్ గంగాడ సుజాత ధ్వజం


మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు

ఒంగోలు సబర్బన్: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోమని మేయర్ గంగాడ సుజాత హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో గురువారం నగర డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, ఇతర కార్పొరేటర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతి విషయాన్ని బాలినేని శ్రీనివాసరెడ్డికి అంటగట్టే పనిలో టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలినేని మంచితనాన్ని చేతగాని తనంగా భావిస్తే అది వారి అవివేకమని కొట్టిపారేశారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న నేత బాలినేని అని, ఆయనకు కబ్జాలు, కుంభకోణాలు చేసే అలవాటు కానీ, అవసరం కానీ లేదన్నారు. ప్రజల్లో ఆయనకు ఎంత మంచిపేరు ఉందో జనాల్లోకి వెళితే అర్థమవుతుందన్నారు. బాలినేని, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డిపై చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడటం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రజల్లో కోల్పోతున్న ఆదరణను చూసి టీడీపీ నాయకులు అధికార వైఎస్సార్ సీపీని ఏదో ఒక విధంగా బదనాం చేయాలన్న దురుద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్పొరేటర్లు గిరిజ శాండిల్య, యనమల నాగరాజు, తాడి కృష్ణలత, షేక్ ఫాతిమా పాల్గొన్నారు.

బాలినేని పేదల మనిషి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి.

- విశ్వసనీయత ఉంది కనుకే దర్యాప్తుకు ఆదేశం
- దొంగ పట్టాలు అందించి ప్రజలను మోసం చేసిన ఘనత టీడీపీదే
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి

ఒంగోలు: 'బాలినేని పేదల మనిషి, నియోజకవర్గంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా గుర్తుకు వచ్చేది బాలినేని నివాసమే' అని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విశ్వసనీయత ఉంది కనుకే నకిలీ స్టాంపుల కుంభకోణంలో బాధితులకు అండగా నిలిచి రాజకీయాలకు అతీతంగా కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసేలా ఎమ్మెల్యే బాలినేని చర్యలు తీసుకున్నారన్నారు. అటువంటి మంచి మనిషిపై ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేయిస్తూ లబ్ధి పొందాలని చూస్తున్న దామచర్ల జనార్దన్, టీడీపీ నేతల విమర్శలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే రాజకీయ మనుగడ కోల్పోయిన దామచర్లకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. బాధ్యత ఉన్న ప్రతిపక్షంగా ఆధారాలతో ఉంటే ఫిర్యాదు చేయాలి తప్పితే బాతాఖానీ విమర్శలు మానుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం వైఖరి చూస్తుంటే దర్యాప్తును ఏదో ఒక విధంగా అడ్డుకోవాలని విమర్శలు చేస్తున్నట్లుగా ఉందన్నారు. ఈ వ్యవహారం బయటకు రావడంతోనే అనేక మంది టీడీపీ నాయకుల మోసంతో బాధపడుతున్న వారు నేరుగా బాలినేని వద్దకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, వీటన్నింటిపై కేసులు కూడా నమోదవుతున్నాయన్నారు. మోసం చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఇప్పటికే బాలినేని స్పష్టం చేశారని, మీ పార్టీలో ఉంటూ మోసం చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. వైఎస్సార్ సీపీ రెండో క్లస్టర్ జగనన్న సచివాలయాలు గృహ సారథుల ఇన్‌చార్జి కొమ్మూరి రవిచంద్ర మాట్లాడుతూ బాలినేని కుటుంబానికి జిల్లాలో ఎంతో పేరుందన్నారు. అటువంటి వ్యక్తి నిష్పక్షపాతంగా విచారణ చేయిస్తుంటే తట్టుకోలేక వ్యక్తిగత విమర్శలు చేయడం దారుణమన్నారు. మూడో క్లస్టర్ ఇన్‌చార్జి బొమ్మినేని మురళి మాట్లాడుతూ నమ్మకంగా ఉంటూ సేవ చేసిన నేతలకు సైతం నకిలీ పట్టాలు ఇచ్చి మోసం చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదని, ఒకరిని విమర్శించే ముందు తమ నిజాయితీ ఏంటో కూడా తెలుసుకొని మాట్లాడాలన్నారు. యరజర్లలో పేదలకు పట్టాలు ఇవ్వకుండా కోర్టుకు వేయించిన టీడీపీకి పేదల ఉసురు తగలక మానదన్నారు. భగవంతుడు అండ బాలినేనికి ఉండబట్టే సమీపంలోనే రూ.200కోట్లు వెచ్చించి 500 ఎకరాలు సేకరించారన్నారు. హబీబ్, ఒంగోలు బుజ్జి పాల్గొన్నారు.

మా భూములు కబ్జా చేసింది టీడీపీ నేతలే: అల్లాభక్షు

స్థానిక 186/1 సర్వేనెంబర్‌లోని మా భూమిలోకి మమ్మలను రానివ్వకుండా అసైన్డ్ భూములంటూ అడ్డుకొని చంపుతామని బెదిరించింది టీడీపీ నాయకులేనని ఒంగోలుకు చెందిన అల్లాభక్షు వాపోయారు. గురువారం వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకున్న వారు మీడియా ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. 2016లో వేసిన లేఅవుట్‌ని అసైన్డ్ భూమి అంటూ నకిలీ పట్టాలతో తమను అడ్డుకున్నారన్నారు. 2010లో పట్టాలు ఇచ్చినట్లు సృష్టించారని, వాస్తవానికి 2012లో లే అవుట్ అప్రూవ్ అయిందని సంబంధిత పత్రాలను మీడియాకు చూపించారు. తమ పట్టాలలో విద్యుత్ లైను కూడా తీసుకుందామని ఆక్రమణదారులు ప్రయత్నించారని, కానీ బాలినేని చొరవతో ఆ వ్యవహారం కాస్తా నిలిచిందన్నారు. తమ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారని, దర్యాప్తు వేగవంతం చేయాలని కోరుతున్నామన్నారు.

ఆటో ఢీకొని మహిళ మృతి


ప్రమీల (ఫైల్)

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై గుట్లపల్లి రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఆటో..స్కూటీని ఢీకొట్టడంతో ఏఎన్ఎం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే..త్రిపురాంతకం మండలం జి.ఉమ్మడివరం పంచాయతీ పరిధిలోని గుట్లపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా వెళ్లి వస్తూ హైవేపై ప్రమాదానికి గురై ఏఎన్ఎం కె.ప్రమీల(45) మృతి చెందింది. గుట్లపల్లి హైవే వద్ద రోడ్డు పైకి వచ్చిన సమయంలో వినుకొండ వైపు నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం వినుకొండ తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్

ఒంగోలు సిటీ: ఇంటర్ ఫెయిలైన విద్యార్థుల రీ అడ్మిషన్, పరీక్ష ఫీజు చెల్లింపు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఇంటర్‌బోర్డు ప్రాంతీయ మండలి పర్యవేక్షణ అధికారి సైమన్ విక్టర్ గురువారం తెలిపారు. 2024 మార్చిలో నిర్వహించనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు గడువును నవంబర్ 30వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు, డ్రాపవుట్ అయిన జనరల్, ఒకేషనల్ విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్‌లో గతంలో చదివిన కళాశాల ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. ఫెయిలైన విద్యార్థి వారికి ఇష్టమైన కళాశాలలో రీ అడ్మిషన్ పొంది అన్ని పరీక్షలకు హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దానిని పరిగణనలోకి తీసుకుంటారన్నారు. కంపార్ట్‌మెంటల్ ఫెయిల్ అనే పదం లేకుండా ఒకేసారి నేరుగా ఉత్తీర్ణులయ్యారని సర్టిఫికెట్ జారీ చేస్తారని కూడా వెల్లడించారు. రీ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు జగనన్న అమ్మ ఒడి, విద్యాకానుక, మొదలగు ప్రభుత్వ పథకాలు కూడా వర్తిస్తాయని తెలిపారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు కల్పించిన ఈ సదావకాశాన్ని జిల్లాలోని ప్రతి కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ప్రతి విద్యార్థి ఇంటికెళ్లి వివరించి వారు సద్వినియోగం చేసుకునేలా, పరీక్షలకు సన్నద్ధులయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

డిజి లాకర్లలో సర్టిఫికెట్లు...

ఇంటర్ పాసైన విద్యార్థుల కోసం ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అందుబాటులో ఉన్నాయని సైమన్ విక్టర్ తెలిపారు. 2014 నుంచి 2023 మధ్య సంవత్సరాలలో పాసైన విద్యార్థుల సర్టిఫికెట్లను డిజి లాకర్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఇంటర్మీడియట్ బోర్డు కల్పించిందన్నారు. విద్యార్థులంతా డిజి లాకర్ యాప్‌ను సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ పొందిన తర్వాత వారికి అవసరమైన సర్టిఫికెట్లు పొందవచ్చని తెలిపారు.

ఉద్యోగ నియామకాలపై తప్పుడు ప్రచారం

ఒంగోలు టౌన్: వైద్య ఆరోగ్య శాఖ నియామకాల్లో కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి తెలిపారు. కొంతకాలంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వివిధ విభాగాల పరిధిలో కాంట్రాక్టు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామని, వాటిని నిబంధనల ప్రకారం భర్తీ చేశామన్నారు. ఉద్యోగ వివరాలను ప్రకాశంఎన్‌ఐసీవెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అర్హతలకు సంబంధించి విద్యార్హతలు, కులం కేటగిరిని పరిశీలించిన తరువాత ఉద్యోగాల నియామకాలు చేపట్టామని, అయితే కార్యాలయంలో పనిచేసే కొందరు, బయటి వ్యక్తులు కలిసి అక్రమాలు జరిగినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు విద్యార్హతలు, కుల ధృవీకరణ పత్రాలతో ఉద్యోగాలను పొందిన వారిని గుర్తించి వారిని ఉద్యోగం నుంచి తొలగించడమే కాకుండా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా ఏదైనా అనుమానాలు ఉంటే వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న సిబ్బందిని గుర్తించి శాఖపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్గో పార్శిల్‌లో అక్రమ మద్యం స్వాధీనం


మద్యం సీసాలతో సెబ్ ఎస్సై, పోలీసులు

పొదిలి: ఆర్టీసీ కార్గో పార్శిల్‌లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ ఎస్సై రాజేంద్రప్రసాద్ గురువారం రాత్రి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పొదిలి కార్గో పార్శిల్ వద్ద తనిఖీలు చేశామన్నారు. మద్యాన్ని కార్గోలో డెలివరీ చేసుకుని తీసుకువెళ్లే ప్రయత్నంలో ఉండగా వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద 15 ఫుల్ బాటిళ్లు, 10 హాఫ్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కర్ణాటక మద్యాన్ని ఆధోని, ఎమ్మిగనూరు నుంచి పొదిలి కార్గో పాయింట్‌కు పార్శిల్ చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

శ్రీగిరికి వెండి ఆభరణాల వితరణ



స్వామివారికి వెండి వస్తువులు సమర్పిస్తున్న దాతలు

ఒంగోలు మెట్రో: ఈనెల 21 నుంచి ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవ రాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలోని విష్వక్సేన స్వామికి గరుడాళ్వార్ కు దాతలు గురువారం వెండి ఆభరణాలను సమర్పించారు. వెండి ఆభరణాలను సమర్పించిన మాచిరాజు రామకృష్ణ, హరికృష్ణ, అరుణ్ ప్రకాష్, కేఏఎస్వీ ప్రసాద్, వినోద్ రమేష్ అర్జా , శ్రీ నీరజ్, ఆలూరు శ్రీ విభవ్‌ను అభినందించారు. ఆలూరు జైశంకర్, ఆలూరు ఝాన్సీ రాణి, ఆలూరు జ్వాలా రామారావు, సీవీ రామకృష్ణారావు, వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

కళాశాలల దోపిడీపై చర్యలు తీసుకోండి



ఆందోళన చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులను సెలవులకు నివాసాలకు పంపు సమయంలో యాజమాన్యాలు.. నగదు వసూలు చేయడాన్ని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఖండించారు. విద్యార్థుల నుంచి రూ. 200 వసూలు చేస్తూ కళాశాల పునః ప్రారంభానికి తిరిగి రానట్లయితే ఆ నగదును తిరిగి ఇవ్వకుండా విద్యార్థులను నిలువునా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.

యానాదుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో పది లక్షల జనాభా కలిగిన యానాదులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యానాదులకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఈనెల 29న ఒంగోలులో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా అన్ని కులాలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యానాదులకు కూడా గుర్తింపు ఇవ్వాలని, యానాదులు అధికంగా ఉన్న 5 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వారికే సీట్లు కేటాయించాలని కోరారు. నెల్లూరు ఐటీడీఏ పరిధిలోని ప్రకాశం జిల్లాలో ఐటీడీఏ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎందేటి వెంకట సుబ్బయ్య, రావూరి ప్రభావతి, చిన్న బ్రహ్మయ్య, మల్లవరపు సీత, మురళి, కొమరగిరి మాల్యాద్రి, దుర్గా ప్రసాద్, మలికి చెంచయ్య పాల్గొన్నారు.

అమృత్ కలశ యాత్ర

ఒంగోలు సెంట్రల్: మేరీమాటి.. మేరా దేశ్ అమృత్ కలశ యాత్రను శ్రీసరస్వతి (ఎస్ఎస్ఎన్ డిగ్రీ) కళాశాల విద్యార్థులు గురువారం నిర్వహించారు. అమరవీరుల త్యాగాలను వివరించారు. సేకరించిన మట్టిని ఎన్ఎస్ఎస్ ద్వారా అందిస్తామని చెప్పారు. కళాశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, డైరెక్టర్లు గణేష్ రెడ్డి, గంగా శంకర్ రెడ్డి, ఒంగోలు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ కె. శ్రీనివాస రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సీఈఓ వెంకట సురేష్, జిల్లా యువజన అధికారి కమల షా, ఎంటీఎస్ అధికారి నాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రాజేంద్రబాబు, జోసఫ్, నిరోషా, సౌమ్య పాల్గొన్నారు.

నైపుణ్యాలపై శిక్షణ

ఒంగోలు సెంట్రల్: శిక్షణలో నేర్చుకున్న విషయాలను సాధన చేయాలని రైజ్ కళాశాల చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్ అన్నారు. డాక్టర్ ఎస్‌వీ నరేష్.. క్లౌడ్ కంప్యూటింగ్‌తో పాటు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ ఏవీ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పనుల్లో పారదర్శకత కోసమే సామాజిక తనిఖీ

పొదిలి రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత కోసమే సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.శీనారెడ్డి పేర్కొన్నారు. గురువారం పొదిలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజా వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్వామా పీడీ మాట్లాడుతూ.. పొదిలి మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 2022–2023 ఆర్థిక సంవత్సరంలో చేసిన 863 పనులకు రూ.7,67,23,690 ఖర్చు చేశారని, వీటిపై సోషల్ ఆడిట్ బృందాలు సామాజిక తనిఖీ నిర్వహించాయన్నారు. చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల్లో చేసిన పూడికతీత పనుల్లో కొలతలు వ్యత్యాసం ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డ్వామా విజిలెన్స్ ఆఫీసర్ ఝాన్సీరాణి, ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ మన్మథరావు, ఏపీఓలు వెంకటరావు, బుల్లెన్నరావు, డీఆర్పీలు, ఈసీ, టీఏలు, సీఓలు, ఎఫ్ఏలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

మద్దిపాడు: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. వెల్లంపల్లిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రజల సంక్షేమం కోసం నిత్యం ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే అని కొనియాడారు. విద్య, వైద్యం వ్యవసాయం మాత్రమే సమాజానికి దోహదపతాయని నమ్మి ఆయన పాటు పడుతున్నారన్నారు. విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి ఆంగ్లమాధ్యమంలో విద్యార్థులకు బోధిస్తున్నారని చెప్పారు. మన విద్యార్థులు ఇతర దేశాల్లో సమ్మిట్‌లలో పాల్గొనే విధంగా తయారు చేస్తున్నారన్నారు. వ్యవసాయానికి పెద్ద పీట వేసి ఆర్‌బీకేల ద్వారా విత్తనం సరఫరా నుంచి ఉత్పత్తి కొనుగోలు వరకూ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తద్వారా రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. వైద్యం విషయంలో తండ్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 108, ఆరోగ్యశ్రీ పథకాలను ఏర్పాటు చేస్తే మన ముఖ్యమంత్రి ఆ పథకాలను కొనసాగిస్తూనే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రవేశ పెట్టారని అభినందనలు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేయడం ద్వారా స్పెషలిస్టు డాక్టర్లతో గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం వలన భారీ సంఖ్యలో రోగులు క్యాంప్‌లకు హాజరౌతున్నారన్నారు. మద్దిపాడు పీహెచ్‌పీ పరిధిలో పని చేస్తున్న అప్తాల్మిక్ ఆఫీసర్ జయరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. శంకర నేత్రాలయంలో కంటి ఆపరేషన్లు చేయిస్తూ అవ్వాతాతలకు అండగా నిలుస్తున్నారని అభినందించారు. ముందుగా ఆయనను గ్రామనాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి మోరబోయిన సంజీవరావు, రాయపాటి రమేష్, బత్తుల శ్రీనివాస రావు, మజీద్ సన్నపురెడ్డి రమణమ్మ, జయమ్మ, మస్తానమ్మ సింగయ్య, బొమ్మల రామాంజనేయులు గ్రామ నాయకులు నలమలపు సుబ్బారెడ్డి పిచ్చిరాజు, కృష్ణారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస రావు, తహసీల్దార్ రజని, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్లు ఆనందమోహన్, శిరీష శ్రావణ్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు మందులు అందజేస్తున్న మేయర్ గంగాడ సుజాత

అందరికీ ఉన్నత వైద్యం

మద్దిపాడు: పైసా ఖర్చు లేకుండా వైద్యం అందరికీ అందుబాటులోకి తేవాలన్న తలంపుతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని రాష్ట్ర ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్ బాబు అన్నారు. వెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో పలువురు రోగులను పరామర్శించారు. వారికి ఎటువంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు, ఎటువంటి మందులు ఇస్తున్నారు అన్న విషయాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ఆరోగ్యం గురించి గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని చెప్పారు. కానీ నేడు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని చెప్పారు. అవసరమైన రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం కూడా అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఇంత శ్రద్ధ తీసుకుంటున్న ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. ప్రజారోగ్యంపై బాధ్యత తీసుకుని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆశిస్తున్నారని చెప్పారు. అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహిస్తూ వారి కళ్లలో వెలుగులు నింపుతున్నారని ఇలా ప్రతి ఒక్కరికీ ఏదో విధంగా ఆరోగ్య సమస్యలు తీరుస్తున్నారని వారి ఆశీస్సులు ముఖ్యమంత్రికి మెండుగా ఉండాలని ఆయన కోరారు. అనంతరం స్పెషలిస్టు డాక్టర్లతో మాట్లాడుతూ మెరుగైన వైద్యం అవసరమైన రోగులను ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు సిఫారసు చేయాలని సూచించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ శ్రీనివాస రావు, తహసీల్దార్ రజని, వైద్యశాఖ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ప్రజలంతా ఆరోగ్యంగా ఉండటమే లక్ష్యం

ఒంగోలు సబర్బన్: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. స్థానిక ముంగమూరు రోడ్డు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం క్యాంపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లాయర్‌పేటలోని వార్డు సచివాలయంలో జరిగిన క్యాంపులో మేయర్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. 35వ డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారి ఆరోగ్యాన్ని కాపాడటానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సరికొత్తగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేర్పించి పేదల ఆరోగ్యాన్ని బాగు చేసిన గొప్ప మానతావాది అని ఆ మహానేత సేవలను గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెయ్యి దాటిన ఎలాంటి వైద్య సేవలకైనా ఆరోగ్య శ్రీలో అవకాశం కల్పించి పేదల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని పేర్కొన్నారు. ఒక పక్క ఆరోగ్య శ్రీ పథకాన్ని సమర్థవంతంగా నడిపిస్తూనే మరోపక్క ప్రతి వార్డు, గ్రామ సచివాలయం పరిధిలో ఇప్పటికే ప్రతి ఇంటింటికీ ఏఎన్ఎంలను, ఆశ వర్కర్లను, వలంటీర్లను పంపి వైద్య పరీక్షలు చేయించారన్నారు. ఆ తరువాత ఆయా యూపీహెచ్‌సీల పరిధిలో సచివాలయాల ఆధారంగా క్యాంపులు నిర్వహించి వైద్య పరీక్షల కేంద్రాలు నిర్వహించి మరీ ఉచితంగా మందులు ఇస్తున్నారన్నారు. అదేవిధంగా ఏమైనా పెద్ద వ్యాధులు ఉంటే ఆరోగ్య శ్రీ రెఫరల్ వైద్యశాలలకు పంపిస్తామని వివరించారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు సంబంధించిన అవకాశాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అనునిత్యం పేదల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సరికొత్త పథకాలు ప్రవేశపెట్టి వారి ఆరోగ్యాన్ని చూస్తోందన్నారు. దేశంలోనే ఇలాంటి ఆరోగ్య పథకాలు ఏ ఒక్క ముఖ్యమంత్రి ప్రవేశపెట్టలేదన్నారు. ఇటీవల జగనన్న సురక్ష పథకం ప్రవేశపెట్టి దాదాపు 9 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్ ముందుకు పోతున్నారని కొనియాడారు. ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు క్యాంపులో పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్యతో పాటు ఒంగోలు నగర పాలకసంస్థ వైద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. గురువారం కూనంనేనివారిపాలెంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మందులను, వృద్ధులకు కళ్లజోళ్లను అందించారు. సచివాయల కన్వీనర్లు యర్రగుంట్ల వసంతరావు, యర్రగుంట్ల మోహన్, ఏలూరి సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: గ్రామ స్థాయిలో ఆరోగ్యం కోసం శిబిరాలు ఉపయోగ పడతాయని జెడ్పీటీసీ యాదల రత్నభారతి అన్నారు. గురువారం ఉప్పుగుండూరు–2 సచివాలయ పరిధిలో నిర్వహించిన బిరాన్ని జెడ్పీటీసీ రత్నభారతి పరిశీలించారు. రోగులకు మందులు అందజేశారు. సర్పంచ్ దేవరకొండ జయమ్మ, మాదాసు రాంబాబు, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, మాదాసు నాగేశ్వరరావు ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్ కుమార్ ఉన్నారు.



వెల్లంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, నాయకులు



కూనంనేనివారిపాలెంలో వృద్ధులకు కళ్లజోళ్లను అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, కన్వీనర్



ఉప్పుగుండూరులో చిన్నారిని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రత్నభారతి

పేస్‌లో పీసీబీ డిజైన్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకట సుమంత్

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులకు సర్క్యూట్స్ బేసిక్స్‌పై అవగాహన చాలా ముఖ్యమని నెల్లూరుకు చెందిన ఎస్‌వీ టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట సుమంత్ అన్నారు. పేస్ కళాశాలలో ట్రిపుల్ ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట సుమంత్ మాట్లాడుతూ సర్క్యూట్ బేసిక్స్ వివరించి పీసీబీ డిజైనింగ్ ప్రాముఖ్యత వివరించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. జీవీకే మూర్తి, ఈఈఈ విభాగపు అధిపతి నాగరాజు, కోఆర్డినేటర్ సాజన్ కుమార్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్



డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కల్యాణి

ఒంగోలు సెంట్రల్: డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 29, 30 తేదీల్లో నాక్ బృందం కళాశాలను సందర్శించిందని చెప్పారు. అనంతరం ప్రకటించిన ఫలితాల్లో కళాశాలకు సీజీపీఏ స్కోర్ 3.35 పాయింట్లతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 165 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏ ప్లస్ గ్రేడ్ సాధించి.. రాష్ట్రంలోనే అత్యధిక స్కోర్‌తో మొదటి స్థానంలో, మూడో జోన్‌లో రెండు, ప్రకాశం జిల్లాలో మొట్టమెదటి కళాశాలగా నిలిచిందని చెప్పారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ పరేడ్ రిహార్సల్స్

ఒంగోలు సబర్బన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం పరేడ్ రిహార్సల్స్ నిర్వహించారు. ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఈ నెల 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తు పోలీస్ కవాతుతో పాటు గ్రౌండ్‌లో చేస్తున్న ఏర్పాట్లను కూడా ఎస్పీ పరిశీలించారు. అమరవీరులకు నివాళులర్పించారు. ఏఎస్పీ(క్రైం) ఎస్.వి.శ్రీధర్ రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు శ్రీహరి రెడ్డి, హరిబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.



పరేడ్ రిహార్సల్స్‌లో ఎస్పీ మలికా గర్గ్

ఎస్సీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బత్తుల

చీమకుర్తి: బీజేపీ ఎస్సీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బత్తుల ఆనంద్‌కుమార్‌ను బీజేపీ అధిష్టానం నియమించింది. ఇప్పటి వరకు బీజేపీ పార్లమెంట్ ఎస్సీ మోర్చా కన్వీనర్‌గా పనిచేసిన ఆనంద్‌కుమార్ సేవలను గుర్తించి స్టేట్ ప్రెసిడెంట్ డి.పురంధేశ్వరి, ఎస్సీ మోర్చా స్టేట్ అధ్యక్షులు దేవానంద్ తనను నియమించటం పట్ల ఆనంద్‌కుమార్ సంతోషం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ మోర్చాఅధ్యక్షుడిగా లక్ష్మణ్

ఒంగోలు సెంట్రల్: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పెరికే లక్ష్మణ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విష్ణు ప్రియ కన్వెన్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతనంగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్‌కు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పీవీ క్రిష్టా రెడ్డి, యోగయ్య యాదవ్ పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట పర్యటన

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి శుక్రవారం ఒంగోలులోని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బా రెడ్డి తెలిపారు. అలాగే పలు ఆలయాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి

యర్రగొండపాలెం: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలో నీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, ఆయా ప్రాంతాల్లో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఎంపీడీఓ వై.వి.నాగేశ్వరప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, కో ఆప్షన్ సభ్యుడు ఎస్.విజయకుమార్, డీటీ విజయభాస్కర్, ఎంఈవోలు.ఆంజనేయులు, మల్లూనాయక్, హెచ్‌వో పి.ఆదిరెడ్డి, ఏవో శేషిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ అంజిరెడ్డి, ఏపీవోలు నాగేశ్వరరావు, శైలజ, వైద్యాధికారులు షేక్ నాయబ్‌రసూల్, మంత్రూనాయక్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మజ, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

25న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

రాచర్ల: మండలంలోని అకవీడులో నూతన షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని ఈ నెల 25న రాష్ట్రస్థాయి సీనియర్ ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు మందిర కమిటీ సభ్యులు తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు మంగళవారం సాయంత్రం 7 గంటల లోగా ఎంట్రీ ఫీజు రూ.1000 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.60 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు అందజేస్తామన్నారు. 95151 79210, 9959640681 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సమగ్ర కులగణన నిర్ణయంపై హర్షం

ఒంగోలు: సమగ్ర కులగణన నిర్ణయాన్ని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, ఇందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఒగ్గులకుంటలోని రజకాభివృద్ధి సంస్థ ఆవరణలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్య్రం రాక పూర్వం 1931లో కులగణన జరిగిందన్నారు. అందులో ఎస్సీ,, ఎస్టీలు తప్ప బీసీ కుల గణన లేదన్నారు.15 నుంచి కుల గణన చేపట్టనున్నట్లు బీసీ సంక్షేమ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో రజక సంఘ నాయకులు మార్తూరి వెంకటేశ్వర్లు, స్వర్ణ మల్లిఖార్జున, పాదర్తి వెంకటేశ్వర్లు, చివుకుల అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండిత పరిషత్ కార్యవర్గ సమావేశం నిర్వహణ

ఒంగోలు సెంట్రల్: జిల్లా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ కార్యవర్గ సమావేశం గురువారం కోర్టు సెంటర్‌లో నిర్వహించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రవిచంద్ర కుమార్, రాష్ట్ర మహిళా కార్యదర్శి మున్నంగి రాహేలు ముఖ్య అతిథులుగా చర్చించారు. పండిత పరిషత్ భవనాన్ని పూర్తి చేయాలని, అప్ గ్రేడేషన్ పొందిన పండితులకు మేళా నిర్వహించాలని సర్వీస్ రెగ్యులర్ చేయుటకు కృషి చేయాలని కోరారు. స్టెప్ అప్ చేయించుకొనేందుకు ఉన్న ఇబ్బందులను అధిగమించేందుకు తగిన కృషి చేయాల్సిన విధానాన్ని వివరించారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మల వెంకటేశ్వర్లు, చుండూరి రఘుబాబు, జిల్లా మహిళా కార్యదర్శి నాగలక్ష్మి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.






పెదకొత్తపల్లిలో సంతాన లక్ష్మి అవతారంలో అమ్మవారు

కరవది రామలింగేశ్వర ఆలయం

గాయత్రి అమ్మవారిగా కరవది రామలింగేశ్వర

చీమకుర్తి హరిహరక్షేత్రంలో కామాక్షి దేవి రూపంలో..

సంతాన లక్ష్మిగా అమ్మవారు

మద్దిపాడు: దేవీ నవరాత్రుల్లో భాగంగా గురువారం ఐదో రోజు మండలంలోని పెదకొత్తపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి వారి ఆలయంలో అమ్మవారు గురువారం సంతాన లక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు ఆగమ ప్రవర విద్వాన్ దివి వెంకట శేషాచార్యులు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందించారు.

ఒంగోలు రూరల్: గ్రామాల్లో దసరా నవరాత్రులు ఆయా దేవాలయాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం పూజలు నిర్వహించారు. పూజారి తీర్థప్రసాదాలు అందజేశారు.

చీమకుర్తి: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం చీమకుర్తిలోని హరిహర క్షేత్రంలో అమ్మవారు శ్రీకామాక్షి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలుతో అభిషేకాలను నిర్వహించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

(...12వ పేజీ తరువాయి)

219			1.3900		మిరియం పేరయ్య (చినసుబ్బయ్య)	92	88	90	102	
220			0.0950		చిట్రగుంట వెంకట రమణయ్య (వెంకమ రాజు)	92	88	90	102	
221			1.6650		ఇతరులు	92	88	90	102	
222			0.4600		బలికిరి మహేష్‌బాబు (సుబ్బారాయుడు)	92	88	90	102	
223	'90'	0.75	0.7500	పట్టా	ఇతరులు	91	44	44	89	
224	'91-1'	2.43	2.4300	పట్టా	శ్రీబండ్లమాంబ దేవి	40,42	90,89	43	96	బోరు బావి-1, బావి-1
225	'91-2'	0.96	0.9600	పట్టా	శ్రీబండ్లమాంబ దేవి	40,42	90,89	43	96	
226	'92'	0.57	0.5700	పట్టా	ఇతరులు	95	89	91	95	బోరు బావి-1
227	'94'	0.32	0.3200	పట్టా	శ్రీబండ్లమాంబ దేవి	96	95	93	96	తాటిచెట్లు
228	'95'	1.14	0.2400	పట్టా	నక్కల వెంకటేశ్వర్లు (వెంకట సుబ్బయ్య)	97	83	92	97	టేకుచెట్లు, మామిడి చెట్లు, బావి-1
229			0.1500		నక్కల యలమందయ్య (చిన సుబ్బయ్య)	97	83	92	97	
230			0.7500		ఇతరులు	97	83	92	97	
231	'96'	5.72	2.8700	పట్టా	గొల్లపోలు వెంకటేశ్వర్లు (అంకయ్య)	రాస్తా	95	40,37	97	
232			0.9500		పులి యానాదమ్మ (వెంకటసుబ్బయ్య)	రాస్తా	95	40,37	97	
233			1.9000		ఇతరులు	రాస్తా	95	40,37	97	
234	'97'	6.69	1.2000	పట్టా	మల్లెబోయిన పుష్పావతి (తిరుపతి స్వామి)	రాస్తా	95	96	100,99	టేకుచెట్లు, మామిడి చెట్లు
235			1.2000		వేల్పుల పద్మావతి (అంకమ్మరావు)	రాస్తా	95	96	100,99	
236			0.1400		పోలుగంగు ప్రమీల (పోలుగంగు శ్రీనివాసులు)	రాస్తా	95	96	100,99	
237			0.4300		బలికిరి మహేష్ బాబు (సుబ్బారాయుడు)	రాస్తా	95	96	100,99	
238			0.4300		బలికిరి కొండలరావు (సుబ్బారాయుడు)	రాస్తా	95	96	100,99	
239			0.4400		బలికిరి సుబ్రమణ్యం (సుబ్బారాయుడు)	రాస్తా	95	96	100,99	
240			1.0000		వేల్పుల వెంకటరమణ (వెంకటస్వామి)	రాస్తా	95	96	100,99	
241			0.4900		ఇతరులు	రాస్తా	95	96	100,99	
242			1.3600		బలికిరి నాగేంద్రబాబు (సుబ్బారాయుడు)	రాస్తా	95	96	100,99	
243	'100'	8.14	2.9500	పట్టా	గొల్లపోలు చెంచులు (శేషయ్య)	99	191	97	160	బోరు బావి-2, వేపచెట్లు,
244			0.7200		నక్కల వెంకటేశ్వర్లు (వెంకట సుబ్బయ్య)	99	191	97	160	
245			1.0000		మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)	99	191	97	160	వేపచెట్లు
246			0.3500		మిరియం పేరయ్య (చినసుబ్బయ్య)	99	191	97	160	
247			3.1200		ఇతరులు	99	191	97	160	-
248	'102'	3.50	1.2400	పట్టా	గొల్లపోలు పెద్ద చెంచులు (వెంచు రామయ్య)	101	103	89	159	బోరు బావి-1
249			0.4800		గొల్లపోలు యానాది (చెంచయ్య)	101	103	89	159	
250			0.5100		బలికిరి సుబ్బారాయుడు (మాలకొండయ్య)	101	103	89	159	
251			0.7700		ఇతరులు	101	103	89	159	
252			0.5000		అట్ల నాగరాజు (రామ్మూర్తి)	101	103	89	159	
253	'103'	4.53	0.5200	పట్టా	గొల్లపోలు యానాది (చెంచయ్య)	102	104	88	156 తాటిచెట్లు	బోరు బావి-1, మామిడి చెట్లు-1,
254			0.3800		బలికిరి సుబ్బారాయుడు (మాలకొండయ్య)	102	104	88	156	
255			1.1000		మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)	102	104	88	156	
256			0.3100		మిరియం పేరయ్య (చినసుబ్బయ్య)	102	104	88	156	
257			0.2500		నూతలపాటి శ్రీకృష్ణ (వెంకటసుబ్బయ్య)	102	104	88	156	
258			0.2500		నూతలపాటి వెంకటసాయి శివప్రసాద్ (వెంకటసుబ్బయ్య)	102	104	88	156	
259			0.2600		నూతలపాటి రవి కుమార్ (వెంకటసుబ్బయ్య)	102	104	88	156	
260			1.4600		ఇతరులు	102	104	88	156	
261	'104-1'	4.00	0.5000	పట్టా	మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)	103	105	84	154	
262			0.6200		మిరియం పేరయ్య (చినసుబ్బయ్య)	103	105	84	154	
263			0.4400		నూతలపాటి శ్రీకృష్ణ (వెంకటసుబ్బయ్య)	103	105	84	154	
264			0.4400		నూతలపాటి వెంకటసాయి శివప్రసాద్ (వెంకటసుబ్బయ్య)	103	105		84	154
265			0.4500		నూతలపాటి రవి కుమార్ (వెంకటసుబ్బయ్య)	103	105	84	154	
266			0.1350		నల్లావుల చెంచమ్మ (సుబ్బారాయుడు)	103	105	84	154	
267			1.1050		ఇతరులు	103	105	84	154	
268			0.3100		మిరియం వెంకటేశ్వర్లు (వెంకటస్వామి)	103	105	84	154	
269	'104-2'	3.24	0.4800	పట్టా	మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)	103	105	84	154	బోరు బావి-1
270			0.3000		మిరియం పేరయ్య (చినసుబ్బయ్య)	103	105	84	154	
271			0.3600		నూతలపాటి శ్రీకృష్ణ (వెంకటసుబ్బయ్య)	103	105	84	154	
272			0.3600		నూతలపాటి వెంకటసాయి శివప్రసాద్ (వెంకటసుబ్బయ్య)	103	105	84	154	
273			0.3600		నూతలపాటి రవి కుమార్ (వెంకటసుబ్బయ్య)	103	105	84	154	
274			0.5700		నల్లావుల చెంచమ్మ (వెంకటసుబ్బయ్య)	103	105	84	154	
275			0.3700		ఇతరులు	103	105	84	154	
276			0.4400		మిరియం వెంకటేశ్వర్లు (వెంకటస్వామి)	103	105	84	154	
277	105'	1.48	0.5000	పట్టా	మిరియం కోటేశ్వరరావు (బాలకోటయ్య)	104	157	84	154	
278			0.3000		మిరియం పేరయ్య (చినసుబ్బయ్య)	104	157	84	154	
279			0.1600		నూతలపాటి శ్రీకృష్ణ (వెంకటసుబ్బయ్య)	104	157	84	154	
280			0.1600		నూతలపాటి వెంకటసాయి శివప్రసాద్ (వెంకటసుబ్బయ్య)	104	157	84	154	
